క్లుప్తంగా

తలారి రంగయ్యకు శుభాకాంక్షలు



రంగయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కుందుర్పి: మాజీ ఎంపీ తలారి రంగయ్యకు మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల రంగయ్యను వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీలోకి తీసుకోవడంతో మంగళవారం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు అనంతపురం వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. జెడ్పీటీసీ రాధాస్వామి, మండల కన్వీనర్ హనుమంత రాయుడు, సర్పంచులు విజయ్, అతావుల్లా, ఎంపీటీసీ వీరన్న, సీనియర్ నాయకులు రామాంజనేయులు ఉన్నారు.

రంగయ్యకు సన్మానం



రంగయ్యను సన్మానిస్తున్న న్యాయవాదులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్యను న్యాయవాదులు మంగళవారం సన్మానించారు. వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ)లో తలారి రంగయ్యకు చోటు దక్కడంతో న్యాయవాదులు హనుమంతురెడ్డి, దాదాఖలందర్, ఎర్రిస్వామి, రామాంజనేయులు తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

రాయదుర్గంటౌన్: మధ్యాహ్న భోజన పథకంలో పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప సూచించారు. మంగళవారం పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం జయప్రదతో కలిసి మధ్యాహ్న నాణ్యతతో పరిశీలించి, పిల్లలతో మాట్లాడారు. అనంతరం అక్కడి నుంచి 15వ సచివాలయాన్ని తనిఖీ చేశారు. మూవ్‌మెంట్ రిజిస్టర్, హాజరు పట్టికను పరిశీలించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు నజీర్, వార్డు ఇన్‌చార్జ్ బషీర్ అహ్మద్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ పీసీ, హెచ్‌సీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా కిరణ్‌కుమార్



ఉరవకొండ: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ పరిధిలోని 13 జిల్లాల ఎక్సైజ్ అసోసియేషన్ కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ ఎన్నికల్లో జిల్లా నుంచి ఉరవకొండ ఎక్సైజ్ కానిస్టేబుల్ కె.కిరణ్‌కుమార్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో ఈనెల 14న జరిగిన ఎన్నికల్లో అనంతపురం జిల్లా నుంచి కిరణ్‌కుమార్ ఇండిపెండెంట్‌గా పోటీ చేసి, 180 ఓట్లకు గాను 123 ఓట్లు సాధించి విజయం సాధించారు. ఉరవకొండ ఎక్సైజ్ కార్యాలయంలో బార్డర్ మొబైల్ పెట్రోలింగ్ పార్టీ కానిస్టేబుల్‌గా ప్రస్తుతం కిరణ్ విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కిరణ్‌కుమార్‌ను జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు, ఉరవకొండ సర్కిల్ ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది సన్మానించారు.

ఉద్యాన పంటల పరిశీలన



గంగవరం వద్ద నేలవాలిన అరటి పంటను పరిశీలిస్తున్న హెచ్‌ఓ కృష్ణతేజ

బెళుగుప్ప: గంగవరం వద్ద ఈదురుగాలులకు నేలవాలిన అరటి, బొప్పాయి తదితర పంటలను ఉద్యానశాఖ మండల అధికారి కృష్ణతేజ మంగళవారం పరిశీలించారు. గ్రామంలోని రైతు మహేష్‌కు చెందిన ఐదు ఎకరాల అరటి పూర్తిగా దెబ్బతినింది. మొత్తం కళ్యాణదుర్గం డివిజన్‌లో మొత్తం 120 ఎకరాల్లో ఉద్యాన పంటలను రైతులు నష్టపోయారని హెచ్‌ఓ తెలిపారు.

దెబ్బతిన్న అరటి తోట పరిశీలన

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని గోళ్లలో గాలీవానకు దెబ్బతిన్న అరటితోటలను కళ్యాణదుర్గం ఉద్యాన అధికారి కృష్ణతేజ మంగళవారం పరిశీలించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి, నష్టం అంచనా వేసి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని రైతులకు తెలియజేశారు. రైతులు మాట్లాడుతూ భారీగా పెట్టుబడి పెట్టి పంటలను సాగు చేశామని, పంట చేతికందే సమయానికి గాలీవానకు పంట నేల కూలిందన్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరారు.

చోరీకి విఫలయత్నం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఎస్‌వీ బార్, హిందూపురం రోడ్డులోని వైన్‌షాపుల్లో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి దోపిడీకి విఫలయత్నం చేశారు. అయితే షాప్‌ల డోర్లు ఎంత ప్రయత్నించినా తెరుచుకోకపోవడంతో దొంగలు వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం షాప్‌ను తెరవటానికి వచ్చిన నిర్వాహకులు విషయాన్ని పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్లూస్ టీం సంఘటనా స్థలాన్ని పరిశీలించింది.

మేత లేక మూగ రోదన

ఓ వైపు ఎండలు మండుతున్నాయి.. అటవీప్రాంతంలో కనుచూపుమేర పచ్చిక కనిపించడంలేదు. మేత కోసం పశువులు, జీవాలను తీసుకెళ్తే ఎటుచూసినా ఎండిన పొలం గట్టు, బీడు భూములే కనిపిస్తున్నాయి. రాబోయే ఖరీఫ్ సీజన్ వరకూ వర్షాలు కురిసే పరిస్థితిలేకపోవడంతో మేత దొరకడం గగనమే. పల్లెల్లో గ్రాసం దొరక్క కొండగుట్టల్లో అరకొర కనిపించే పచ్చిక కోసం కిలోమీటర్ల దూరం పశువులను తీసుకెళ్లాల్సి పరిస్థితి. కొందరు మేత లేక సంతల్లో పశువులు, జీవాలు అమ్ముకుంటున్నారు. కనీసం కూటమి ప్రభుత్వం పశుగ్రాస కేంద్రాలు కూడా ఏర్పాటు చేయలేదని కాపరులు, పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బెళుగుప్ప సమీపంలో నల్లరేగడి భూమిలో ఎండుగడ్డి కోసం వెంపర్లాడుతున్న జీవాలు



కూడేరు సమీపంలోని అటవీ ప్రాంతంలో ఎండుగడ్డిని మేపుతున్న పశుపోషకుడు

- జీవాలు, పశువులకు భారంగా మారిన గ్రాసం సేకరణ
- మేత దొరక్క అల్లాడుతున్న పశువులు
- పశుగ్రాస కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించని ప్రభుత్వం
- అల్లాడుతున్న పాడి, పశువుల కాపరులు

ఉరవకొండ: ఉరవకొండ మండల పరిధిలోని షేక్షానుపల్లి, లత్తవరం, కోనాపురం తదితర గ్రామాల్లో అధిక సంఖ్యలో పాడి, గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. నాలుగు గ్రామాల్లోనే దాదాపు 25 వేల గొర్రెలు, మేకలు ఉన్నాయి. రెండు నెలలుగా గొర్రెల పోషణ భారంగా మారడంతో పోషకులు గొర్రెలను అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇలా ఈ ఒక్క మండలంలోనే కాక ఉరవకొండ పశుసంవర్ధకశాఖ డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి వచ్చింది.

ఆకాశాన్నంటిన గ్రాసం ధరలు..

ప్రస్తుతం రబీ సీజన్ కింద సాగైన వేరుశనగ పంటకు సంబంధించి లభించిన వేరుశనగ పొట్టు ఎడ్లబండి ధర రూ.10 నుంచి రూ.12 వేలు పలుకుతోంది. ఒక ట్రాక్టర్ వరి గడ్డి దూరాన్ని బట్టి రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ధర పలుకుతోంది. ఈ ధరలు చెల్లించలేక, గ్రాసం సేకరించలేక పశుపోషకులు అవస్థలు పడుతున్నారు.

పశువులను అమ్ముకుంటున్న రైతులు..

పశువులు, జీవాలకు మేత దొరక్క గ్రామాలు వదిలి మేతకు తీసుకెళ్లే పరిస్థితి లేక కొందరు పశు పోషకులు అయిన కాటికి పశువులను సంతల్లో అమ్ముకుంటున్నారు. గ్రామాల్లో పశువులను కొనడానికి దళారీలు రంగ ప్రవేశం చేసి తక్కువ ధరకు కొంటున్నారు. కొందరు పశువులను అమ్ముకునేందుకు మనసురాక అరకొర మేతతోనే అలానే కాలం వెళ్లదీస్తున్నారు.

ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డివిజన్ పరిధిలోని ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం, గుంతకల్లు నియోజకవర్గాల్లో పశువుల, గొర్రెలు, మేకల వివరాలు:

మొత్తం మండలాలు:	15
పశువులు:	2.15 లక్షలు
గొర్రెలు:	11 లక్షలు
మేకలు:	2.42 లక్షలు

అవస్థలు పడుతున్నాం



పశువులకు గడ్డి దొరక్క ఎన్నో అవస్థలు పడుతున్నాం. రోజంతా పశువులను తోలుకొని కొండగుట్టల వెంబడి వెళ్లినా కనీసం కనుచూపు మేర ఎక్కడా పచ్చిక కనిపించడంలేదు. పశువులకు రోజూ నీళ్లు తాపించి, అరకొర మేతతోనే కాలం వెళ్లదీస్తున్నాం. – లక్ష్మన్న, కూడేరు రైతు

జీవాలు అమ్మాల్సి వచ్చింది..



గొర్రెలు, మేకలకు మేతలేక పోవడంతో అయిన కాటికి అమ్ముకుంటున్నాం. 50 గొర్రెల్లో ఇప్పటికే 20 గొర్రెలను తక్కువ ధరకే విక్రయించాం. ప్రభుత్వం మా బాధలు గుర్తించి ఉచితంగా గ్రాసం అందించేందుకు చర్యలు తీసుకోవాలి. – గోపాల్, ఉరవకొండ

ఉన్నతాధికారులకు ప్రతిపాదించాం



వేసవి కావడంతో గ్రాసం దొరకడం కష్టమే. ప్రత్యామ్నాయంగా సమీకృత దాణా, మాగుడు గడ్డి కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఉపాధి పథకం కింద పశుగ్రాసాన్ని పెంచుకునేలా వారికి అవగాహన కల్పిస్తున్నాం. ఈపథకం ద్వారా రైతులకు సబ్సిడీ కూడా అందుతుంది. – డాక్టర్ వెంకటేష్, పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్, ఉరవకొండ

మారెమ్మను దర్శించుకున్న మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: మండలంలోని 43 ఉడేగోళంలో గ్రామదేవత మారెమ్మదేవిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఎంపీటీసీ బి.గోపాల్ నేతృత్వంలో మారెమ్మదేవి దేవర జరిగింది. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, జిల్లా కార్యదర్శి పాటిల్ చెన్నకేశవరెడ్డి, జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డితో కలిసి మెట్టు ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, వైస్ కన్వీనర్ వేమన, రాయదుర్గం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు డి.శ్రీనివాసులు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప, కోళకుర్తి సర్పంచు భాస్కర్‌రెడ్డి, బ్రహ్మసముద్రం మాజీ సర్పంచు లోకేష్‌గౌడ్, నాయకులు కురుబ మల్లికార్జున, తుకారం, మారెంపల్లి మహేష్, ఆంజనేయులు, తిమ్మప్ప, హనుమంతప్ప పాల్గొన్నారు.



మారెమ్మకు పూజలు చేయిస్తున్న మెట్టు

కాంతారెడ్డితో మెట్టుగోవిందరెడ్డి ములాఖత్

రాయదుర్గం: అక్రమ కేసుల్లో అరెస్టయిన గుమ్మఘట్ట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గౌని కాంతారెడ్డితో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ములాఖత్ అయ్యారు. మంగళవారం కళ్యాణదుర్గం సబ్ జైలుకు వెళ్లి మాట్లాడారు. అనంతరం బయటకు వచ్చి కార్యకర్తలు, పార్టీ నాయకులు, కాంతారెడ్డి బంధువులతో మాట్లాడారు. అంతా మంచే జరుగుతుందని ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కొందరు పోలీసులు అక్రమ కేసులు పెట్టడంలో అత్యుత్సాహం చూపడం సరైంది కాదన్నారు. పోలీసు వ్యవస్థపై తమకు అపార గౌరవం ఉందన్నారు. న్యాయబద్ధంగా వ్యవహరించాలన్నారు. తప్పుచేసిన వాడిని శిక్షించాల్సింది పోయి ఏ సంబంధంలేని వ్యక్తులను కేసుల్లో ఇరికించి, వేధించడం సరికాదన్నారు. వరుస కేసులపై ఇది వరకే కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబుతో చర్చించామన్నారు. త్వరలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డితో కలసి జిల్లా ఎస్పీ జగదీష్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.

రామ్మోహన్ సేవలు మరువలేనివి

ఉరవకొండ: పార్టీ సీనియర్ నాయకుడిగా వైఎస్సార్‌సీపీకి విశ్రాంత ఎక్సైజ్ సీఐ రామ్మోహన్ చేసిన సేవలు మరవలేనివని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రామ్మోహన్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే విశ్వతో పాటు పార్టీ ముఖ్య నేతలు మంగళవారం పరామర్శించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే విశ్వ మృతుడి భార్య, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు రోజుల పాటు రామ్మోహన్ ఇంట్లోనే బస చేశారని గుర్తు చేశారు. అనంతరం రామ్మోహన్ చిత్రపటం వద్ద పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి సీపీ వీరన్న, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు నరసింహులు, ఈడిగ ప్రసాద్, బసవరాజు, సింగాడి తిప్పయ్య, మూలగిరిపల్లి ఓబన్న, ఎర్రిస్వామిరెడ్డి, పచ్చిరవి, అంగడాల ఆంజి, కురుబ ప్రకాష్, రాయల్‌మల్లి, విశ్రాంత ఉపాధ్యాయులు ఎర్రిస్వామి, మహానంది, చిన్న భీమ, ఆమిద్యాల అనిల్ జోగిహనుమంతు, జోగి భీమా, ఓబుళేసు, జోగి వెంకటేష్, మైనార్టీ నాయకులు ఆసీఫ్, మైనుద్దీన్, బాషా తదితరులు పాల్గొన్నారు.



రామ్మోహన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, పార్టీ నాయకులు

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

గుమ్మఘట్ట: సబ్సిడీ రుణాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. 2025–26 సంవత్సరానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీలకు సబ్సిడీ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. మే 11 నుంచి 20వ తేదీ వరకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. apobmms.apcfss.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

ముందస్తు చర్యలతో ఊజీ నివారణ

కూడేరు: ముందస్తు చర్యలు చేపడితే మామిడి కాయలకు ఊజీ తెగులు సోకకుండా అరికట్టొచ్చని ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ ఎంటీఎల్ శివమ్మ తెలిపారు. మంగళవారం అరవకూరులో శివమ్మకు చెందిన మామిడి పొలంలో ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో మామిడికి ఊజీ రాకుండా ఏవిధంగా అరికట్టవచ్చో రైతులకు అవగాహన కల్పించారు. ఎంటీఎల్ శివమ్మ మాట్లాడుతూ మామిడి కాయలకు రసాయనిక మందులు పిచికారీ చేయనవసరం లేదన్నారు. ఏఈఓ షామీర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు గొడుగుల పంపిణీ

వజ్రకరూరు: మండల కేంద్రంలో అభయ ఫౌండేషన్ – నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరువ్యాపారులకు గొడుగులు మంగళవారం పంపిణీ చేశారు. సర్పంచు మోనాలిసా, తహసీల్దార్ నయాజ్ అహ్మద్ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శులు మల్లయ్య, అనిల్‌కుమార్, వీఆర్వోలు భరత్, మారెన్న, జనసేన నాయకుడు అచ్చనాల కేశవ్, సామాజిక కార్యకర్తలు బెంజి మెన్, మల్లికార్జున పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

హౌసింగ్ కార్యాలయం సందర్శన

వజ్రకరూరు: మండల కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయాన్ని డీఈ ఎం.హనుమప్ప మంగళవారం సందర్శించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. నూతనంగా ఇళ్ల మంజూరు కోసం వచ్చిన దరఖాస్తులు, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ చెన్నారెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ గులామ్ తదితరులు పాల్గొన్నారు.

17న గణపతి, దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ట

కూడేరు: ప్రసిద్ధిగాంచిన షిర్డీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 17న గణపతి, దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. 16న ఉదయం 8 గంటలకు పుణ్యహవాచనం, నవగ్రహ ఆరాధన, గణపతి హోమం, నవగ్రహ దత్తాత్రేయ హోమం, సాయంత్రం 5 గంటలకు జలధి వాసం , మహా మంగళహారతి ,17న ఉదయం 8–9 గంటల్లోపు విగ్రహాల యంత్ర , బింబి ప్రతిష్టాపన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు వినియోగదారుల సేవా శిబిరం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో 16న వినియోగదారుల సేవల పరిష్కార శిబిరం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ హరికృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కస్టమర్ సర్వీస్ మంత్‌లో భాగంగా ఈ శిబిరాన్ని ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఆకట్టుకున్న అగ్నిమాపక విన్యాసాలు



ఉరవకొండ పాత బస్టాండ్ వద్ద విన్యాసాలు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఉరవకొండ: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద అగ్నిమాపక సిబ్బంది చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మంగళవారం ఉరవకొండ అగ్నిమాపక శాఖ అధికారి భీమలింగయ్య ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను ఎలా అదుపు చేస్తారో డెమో చేసి చూపించారు.

అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నివారణ

రాయదుర్గంటౌన్: అవగాహన, జాగ్రత్తలు పాటిస్తే అగ్ని ప్రమాదాలు నివారించొచ్చని అగ్నిమాపకశాఖ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని కోట ఏరియాలోని మారెమ్మగుడి వద్ద, బళ్లారి రోడ్డు, వినాయ సర్కిల్, పాత బస్టాండ్‌లలో ప్రజలకు ప్రమాదాల నివారణపై సిబ్బంది ఫైర్ మాక్ డ్రిల్‌తో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం

కళ్యాణదుర్గం రూరల్: శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప మండిపడ్డారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పంప్ హౌస్ వద్ద జరుగుతున్న శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమ్మె మంగళవారం పదో రోజుకు చేరింది. సమ్మెకు సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల సమస్యలను విస్మరించిందన్నారు. శ్రీరామిరెడ్డి నీటి సరఫరా కార్మికులకు 6 నెలలుగా జీతాలు చెల్లించలేదని, 30 నెలల పీఎఫ్ బకాయి చెల్లించాల్సి ఉన్నా కూటమి ప్రభుత్వం స్పందించలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్, మండల అధ్యక్షుడు రంగనాథ్, శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు పాల్గొన్నారు.



పంప్‌హౌస్ వద్ద సమ్మె చేస్తున్న సీఐటీయూ నాయకులు, శ్రీరామరెడ్డి పథకం కార్మికులు

'పోషణ పక్వాడా'తో రక్తహీనత దూరం

రాయదుర్గంటౌన్: పౌష్టికాహారం తీసుకుంటేనే గర్భిణులు రక్తహీనత లేకుండా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజినమ్మ తెలిపారు. మంగళవారం స్థానిక వేణుగోపాలస్వామి గుడి వద్ద గల అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవం నిర్వహించారు. కార్యకర్త కృష్ణవేణి పాల్గొన్నారు.

వజ్రకరూరు: కడమలకుంటలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హెచ్.పద్మా ఆధ్వర్యంలో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవం– పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అనసూయమ్మ, సుంకమ్మ, సహాయకులు శివ లక్ష్మి, శ్రావణి, చిన్నారులు, వారి తల్లులు తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: 'పోషణ పక్వాడా' కార్యక్రమంతో గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత లేకుండా చేయొచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి తెలిపారు. మంగళవారం పి.నారాయణపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడాలో భాగంగా పౌష్టికాహారంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. సీడీపీఓ శ్రీదేవి మాట్లాడుతూ పౌష్టికాహారం లోపిస్తే రక్తహీనత ఏర్పడి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఆరేళ్లలోపు పిల్లల్లో పౌష్టికాహారం లోపిస్తే వారిలో శారీక, మానసిక ఎదుగుదల తగ్గిపోతుందన్నారు. ఏసీడీపీఓ ఎల్లమ్మ, సూపర్‌వైజర్ అరుణ, పంచాయతీ కార్యదర్శి కాంతమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కడమలకుంటలో పౌష్టికాహార పక్షోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ముగిసిన జంబుకేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



అలంకరణలో జంబుకేశ్వరస్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వర స్వామి బ్రహ్మోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. చివరి రోజు మంగళవారం సాయంత్రం స్వామి వారి సప్త ప్రాకారోత్సవం, శయనోత్సవ వేడుకలను అర్చకులు రామకృష్ణ స్వామి ఆధ్వర్యంలో జరిగాయి.

హంసవాహనంపై వేంకటేశ్వరస్వామి దర్శనం

వజ్రకరూరు: మండల కేంద్రంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా జనార్ధన వేంకటేశ్వరస్వామి మంగళవారం హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేకపూజలు, విశేష పూజలు, మహా మంగళహారతి ఇచ్చారు. సుదర్శన చక్ర పూ జ, నిత్య హోమం,విష్ణు శాస్త్రపారాయ ణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.



హంసవాహనంపై జనార్ధన వేంకటేశ్వరస్వామి

అందుబాటులో వీల్‌చైర్లు

కళ్యాణదుర్గం: ఆర్డీఓ కార్యాలయానికి వచ్చే దివ్యాంగుల సౌకర్యార్థం మూడు వీల్ చైర్లను ఆర్డీఓ వసంత బాబు వితరణ చేశారు. మంగళవారం కార్యాలయ ఏఓ ఈశ్వరమ్మ చేతులమీదుగా దివ్యాంగులకు వీల్‌చైర్లను అందించారు. గతంలో దివ్యాంగులు సమస్యలు తెలుపుకోవడానికి కార్యాలయానికి వచ్చిన సమయంలో వీల్‌చైర్లు లేక అవస్థలు పడుతుండేవారు. ఈ విషయాన్ని దివ్యాంగుల సంఘం నాయకులు వసంత్‌కుమార్ ఉద్దీప్, మల్లాపురం దొణస్వామి, చెన్నమల్లప్ప ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు.స్పందించిన ఆయన వీల్‌చైర్లను అందుబాటులో ఉంచారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఫాతిమా మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: గోళ్లలో వైఎస్సార్‌సీపీ కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రెహమాన్ తల్లి పాతిమా మంగళవారం మృతి చెందింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, నాయకులు మృతురాలు రెహమాన్ కుటుంబాన్ని పరామర్శించారు. పాతిమా మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. దురుదకుంటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మూర్తి కూతురు శృతి అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయతిప్పేస్వామి, నాయకులు మూర్తి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోళ్ల సూరి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రంపల్లి కృష్ణమూర్తి, నాయకులు పాతలింగ, , మల్లికార్జున పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

గుమ్మఘట్ట: రేషన్‌కార్డులో ఉన్న లబ్ధిదారులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ రఘు, ఆర్‌ఐ రామాంజనేయులు, వీఆర్వోలు వీరేష్, శాంతేష్, మాణిక్య, రమేష్, పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తుంటే 1098కి సమాచారమివ్వండి

కూడేరు: సమాజంలో ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తుంటే వెంటనే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారమివ్వాలని నియోజకవర్గ హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్‌ఎండీ షఫి తెలియజేశారు. మంగళవారం కరుట్లపల్లి జెడ్పీ హెచ్‌ఎస్‌లో టీనేజీ ప్రెగ్నెన్సీ, బాల్య వివాహాల ద్వారా కలిగే ఇబ్బందులపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ మాట్లాడుతూ చిన్న వయసులో పెళ్లి చేస్తే శారీరక, మానసిక ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దని పిల్లల తల్లిదండ్రులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆంజనేయులు, సూపర్‌వైజర్ రవీంద్ర, సీహెచ్‌ఓ మాధవి, హెల్త్ అసిస్టెంట్ రమేష్, ఏఎన్‌ఎం రాధిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపి టాపర్లుగా నిలిచిన మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మంగళవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకుల ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభకు 21 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. భవిష్యత్‌లో ఉన్నత విద్యలోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వీరేష్, ఆదిల్ బాష, శ్రీనివాసులు, వెంకటేశులు, గోవిందరెడ్డి, అక్కులరెడ్డి, రూపవతి, అరుణ, నజీర్ అహ్మద్, చంద్రశేఖర్ అజాద్, ఎర్రన్న, బైయపరెడ్డి, నరసింహులు, ధనుంజయ, వెంకటేశ్‌నాయక్, నరసింహులు, సునీత, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ అందక అవస్థలు

ఉరవకొండ: షేక్షానుపల్లి గ్రామ ప్రజలురేషన్ సక్రమంగా అందక అవస్థలు పడుతున్నారు. మూడు నెలలుగా గ్రామస్తులకు అందించే బియ్యం కోటాలో కూడా కోత విధిస్తుండడంతో కార్డులు ఇబ్బందులకు గురవుతున్నారు. 15 కేజీల బియ్యం ఇవ్వాల్సి ఉండగా కేవలం 10 కేజీలు, 20 కేజీలు ఉంటే 10 కేజీలు, ఇలా ప్రతి కార్డుపై 5 నుంచి 10 కేజీలు కోత విధిస్తున్నారని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే కొందరు టీడీపీ నాయకులు గతంలో కరోనా సమయంలో బియ్యం ఉచితంగా అందించారని, ప్రస్తుతం ఆ కోటాను కోత విధిస్తూ అందిస్తున్నారని ప్రచారం చేస్తున్నారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు అయ్యమ్మ, ఎల్లప్ప, రంజాన్ మాట్లాడుతూ బియ్యం కోటాలో కోత విధించి పేదల నోళ్లు కొట్టడం అన్యాయమన్నారు. 40, 60 ఎఫ్‌సీ షాపుల డీలర్లు, గ్రామ టీడీపీ నాయకులు బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఘనంగా కువ్వాడమ్మ జాతర



అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : పిల్లలపల్లి గ్రామంలో కువ్వాడమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయంలో అమ్మవారి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. అనంతరం కువ్వాడమ్మ ఆలయం ముందు పోతురాజులు గావు మహోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.